తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## జిల్లా కలెక్టర్‌చే సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



కుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఈనెల 30న కుప్పంలో పర్యటించనున్న విషయం విదితమే. దీ ంతో సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా ఎస్పీ మణికంఠ చం దోలుతో కలసి సిఎం పర్యటన ప్రాంతాలను పరిశీలించారు. మున్సిపల్ పరిధి పరమ సము ద్రం చెరువు వద్ద సిఎం చంద్రబాబు దంపతులు కృష్ణాజలాలకు జలహారతులు ఇవ్వనున్నారు. అలాగే అక్కడే జరిగే బహిరంగసభలో సిఎం పాల్గొంటారు. అందుకు తగిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బహిరంగసభ ప్రదేశం, పార్కింగ్, భద్రత ఏర్పాట్లపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు విఠల్ ప్రసాద్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, సిఐలు శంకరయ్య, మల్లేష్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, గణపతి, స్థానిక నేత ప్రతాప్ సింహ, వివిధ శాఖల అధికారులు

## కాణిపాకంలో పందిరి కొయ్యకు ప్రత్యేకపూజలు



కాణిపాకం, ఆగస్టు 25 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 28న గురువారం జరుగనున్న ధ్వజారోహణం కార్యక్రమంకు పందిరి వేయడానికి పందిరి కొయ్యకు ఆలయ ఈఓ పెంచల కిషోర్ చేతుల మీదుగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయంలో బంగారు ధ్వజస్థంభం ధ్వజారోహణ కార్యక్రమం జరుగనుంది. ఈమేరకు పందిర వేయడానికి కొయ్యకు ప్రత్యేకపూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఈఈ వెంకట నారాయణ, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కుదరని ఏకాభిప్రాయం

**జిల్లా టిడిపి అధ్యక్ష కుర్చీకి పోటా పోటీ!**
**- త్రిసభ్య కమిటీ సభ్యులకు 20 మంది దరఖాస్తులు**

చిత్తూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త:

జిల్లా తెలుగుదేశం అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ నెలకొంది. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి నియామకం కోసం అభిప్రాయ సేకరణ చేపట్టడానికి వచ్చిన త్రీమెన్ కమిటీ సభ్యులకు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకుల నుండి పెద్ద ఎత్తున దరఖాస్తులు అందడంతో ఈ వ్యవహారం ఇక్కడికిక్కడే తేలేది కాదని జిల్లా టిడిపి అధ్యక్ష పదవిలో ఎవరిని కూర్చొబెట్టాలని అభిప్రాయ సేకరణ చేయడానికి వచ్చిన త్రీమెన్ కమిటీ సభ్యులు చేతులు ఎత్తివేశారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి ఎవరికి కట్టబెట్టాలనే విషయంపై అభిప్రాయ సేకరణ చేసి పార్టీ అధిష్టానికి నివేదిక సమర్పించడానికి సోమవారం పార్టీ అధిష్టానం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు ఆర్అండ్‌బి శాఖ మంత్రి బిసీ జనార్ధన్‌రెడ్డి(నంద్యాల), ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు (గుంటూరు)లు చిత్తూరు వచ్చారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ విస్తృత సమావేశంకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ నాయుడు, పులివర్తినాని, గాలి భానుప్రకాష్, డాక్టర్ విఎం థామస్, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం అధ్యక్ష పదవి ఆశిస్తున్న నాయకులు పెద్ద ఎత్తున హాజరై త్రీమెన్ కమిటీ సభ్యులకు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్ తనను మరోసారి కొనసాగించాలని త్రీమెన్ కమిటీ సభ్యులకు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే బంగారుపాళ్యం మండల మాజీ పార్టీ అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, నగరి నియోజకవర్గానికి చెందిన జిల్లా తెలుగుయువత మాజీ అధ్యక్షుడు పోతుగుంట విజయబాబు, జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీ, తెలుగు యువత నాయకుడు వసంత్‌కుమార్, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధులు వెంకిటీల సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్‌లు, గురజాల సందీప్, జిల్లా తెలుగుమహిళ నాయకురాలు అరుణ, సీనియర్ దేశం నాయకులు అశోక్ ఆనంద్ యాదవ్ తదితరులు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులు సమర్పించారు.

అలాగే జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి పదవి కోసం ప్రస్తుత జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్‌తో పాటు జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, కార్వేటినగరంకు చెందిన చంద్రారెడ్డి తదితరులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాయకులు చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అధిష్టానం దృష్టికి ఆశావాహుల జాబితా

**- త్రిసభ్య కమిటీ సభ్యులు ఆర్అండ్‌బి శాఖ మంత్రి బిసీ జనార్ధన్‌రెడ్డి**




చిత్తూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త:

జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్న ఆశావాహుల జాబితాను పార్టీ అధిష్టానంకు సమర్పిస్తామని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి నియామకం కోసం పార్టీ అధిష్టానం నియమించిన త్రీమెన్ కమిటీ సభ్యుల్లో ఒకరైన రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రి బిసీ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.. చిత్తూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం జిల్లా పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో త్రీమెన్ కమిటీ సభ్యులు ఆర్అండ్‌బి మంత్రి బిసీ జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావులు హాజరై జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న నాయకులతో విడివిడిగా మాట్లాడి అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా త్రీమెన్ కమిటీ సభ్యులు ఆర్అండ్‌బి మంత్రి బిసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికంగా, క్షేత్రస్థాయిలో పార్టీ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన నాయకుల వివరాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళి పార్టీ కమిటీల్లో పెద్ద పీట వేయ డానికి కృషి చేస్తామన్నారు. పార్టీ కమిటీల్లో 30 శాతం యువ తకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు 70 శాతం అనుభవానికి పెద్దపీట వేసే విధంగా కమిటీల కూర్పు వుంటుందన్నారు. పార్టీ పరిశీలకులుగా తమ దృష్టికి వచ్చిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని వాటిపై కూలంకషంగా చర్చించి పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కమిటీల ఏర్పాటులో ఎవరికి స్థానం కల్పించాలనే విషయంలో పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయమే అందరికీ శిరోధార్యం అని పదవులు దక్కినా, దక్కకపోయినా పార్టీ నిర్ణయంను గౌరవించి పార్టీ అభివృద్ధి కోసం అందరితో కలసిమెలసి నిబద్ధతతో పని చేయాలని ఆయన నాయకులను కోరారు. ఈ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ నాయుడు, పులివర్తినాని, గాలి భానుప్రకాష్, డాక్టర్ విఎం థామస్, డాక్టర్ కలికిరి మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు, డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాయకులు చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిఆర్ బాండ్లు
# అర్హులైన వారికి ఇస్తున్నాం

- ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వండి
- గ్రామాలనుంచి వచ్చే ఆదాయం గ్రామాభివృద్ధికే ఖర్చు చేయాలి
- శెట్టిపల్లి భూముల సమస్య త్వరలో పరిష్కారం
- ఆదాయం పెంపుదలకు కొత్త లే అవుట్స్ ఏర్పాటు
- పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



తిరుపతి, ఆగస్టు 25, ప్రభాతవార్త :

ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం ఉదయం తుడా కార్యాలయంలో నగరపాలక సంస్థ , తుడా అధికారులతో అభివృద్ధి పనులు, ప్రజలకు కల్పించాల్సిన వసతులపై మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. తుడా టవర్స్, ప్లాట్స్, దుకాణాల పై వచ్చే అదాయ, వ్యయాలపై తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, వి.సి., జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగరపాలక సంస్థలో పారిశుద్ధం, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కార్మికులకు కల్పించాల్సిన వసతులపై కమిషనర్ ఎన్.మౌర్య వివరించారు. టౌన్ షిప్‌లను అభివృద్ధి చేసి తుడా ఆదాయాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. తుడా ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అన్నారు. పక్కా ప్రణాళికతో ముందుకెళ్లి లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించే నివేదికలను ఇవ్వకుండా వాస్తవాలను వివరించి, ప్రజల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. నెల్లూరు తరహాలో తిరుపతిలో కూడా రోడ్ల శుభ్రతకు స్వీపింగ్ మిషన్‌లను వినియోగించాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు కృష్ణా రెడ్డి, శ్యాంసుందర్, ఈ.ఈ.లు రవీంద్ర, తులసి కుమార్, గోమతి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## బతుకుతెరువు కోసం రోడ్డెక్కిన కార్మికులు



రేణిగుంట ఆగస్టు 25 ప్రభాతవార్త

రేణిగుంట ఐటీ హబ్ లోని వింగ్ టెక్ కంపెనీ కార్మికులు బ్రతుకుతెరువు కోల్పోయామంటూ సోమవారం రోడ్డు ఎక్కి ధర్నా చేస్తూ అటు జిల్లా కలెక్టర్, ఇటు ఏర్పేడు పోలీస్స్టేషన్లో ఫిర్యాదులు చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అందులో పని చేస్తున్న దాదాపు 200 మంది కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించిందని కార్మికుల ఆవేదన. కంపెనీ ముందు కార్మికులు బైఠాయించి పెద్ద ఎత్తున కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే తమకు జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు తమ శ్రమను దోచుకొని మంచి లాభాలు అర్జించి ఇప్పుడు విధుల్లో నుంచి తొలగించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ విషయమై జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ప్రకటన విడుదల చేస్తూ చైనాకు చెందిన వింగ్ టెక్ కంపెనీ యాజమాన్యం ప్రభుత్వానికి ఇచ్చిన హామీకి భిన్నంగా ప్రకటించిన పెట్టుబడులు పెట్టకపోగా పూర్తిస్థాయిలో రాయితీలు పొంది లాభాలు గడిచింది అన్నారు. కంపెనీ అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకొని ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు పన్నులు చెల్లించలేదన్నారు. అర్ధాంతరంగా కార్మికులను విధుల్లో నుండి తొలగించి కార్మికుల శ్రమను దోపిడీ చేసి చట్టపరమైన షరతులను కాలరాస్తూ సంపదతో తరలిపోవాలని చూస్తున్న యాజమాన్యాలను జిల్లా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు అడ్డుకోవాలన్నారు. వింగ్ టెక్ పరిశ్రమను స్వాధీనం చేసుకుని పరిశ్రమలు నడిపించి ఉద్యోగాలు కోల్పోయిన ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని కంపెనీలో పనిచేస్తున్న కార్మికులను వారి కుటుంబాలని ఆదుకోవాలని అన్నారు..

# బావులను తలపిస్తున్న రోడ్లు

**పట్టించుకోని ఆర్అండ్‌బి శాఖ అధికారులు**
**అవస్థలు పడుతున్న వాహనచోదకులు**
**సత్యవేడు నియోజకవర్గంలో ఇదీ రోడ్ల దుస్థితి**





అధ్వానంగా మారిన రోడ్లు

సత్యవేడు, ఆగస్టు 25 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సత్యవేడు నియోజకవర్గంలో సినిమాల్లో లాగా వాడుపోతే..వీడు...విడిపోతే వాడు...ఆధిపత్య పోరు.....ఈ పరిణామాల్లో ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ముఖ్యంగా భారీ వాహనాల తాకిడికి రహదారులు నోర్లు తెరిచి బావులను తలపించే విధంగా తయారైంది. ఈ కారణంగా రాకపోకలు సాగించడం వాహనదారులకు, ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. సత్యవేడు మండలంలో రోడ్ల భవనాల శాఖ అధికారులు కనిపించడమే కరువైంది. ఇలాంటి పరిస్థితుల్లో రోడ్ల పర్యవేక్షణ ఎలా ఉంటుందో అవగతం చేసుకోవాలి. ప్రధానంగా సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. టిప్పర్‌లారీలు తాకిడి తమిళనాడు నుంచి వాహనాల రాకపోకలు పెరిగిపోవడం. అసలే అధ్వానం ఉన్న రోడ్లు వాటి మీద భారీ వాహనాల తాకిడి బావులను తలపించే విధంగా ఈ రోడ్డు దుస్థితికి చేరింది. వీఆర్ కండ్రిగ మాధిగవాడ సమీపంలో రోడ్డు ప్రమాద భరితంగా మారింది. ఈ రోడ్ల మీద నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ద్విచక్రవాహన చోదకులు ఆ గుంతల్లో రాత్రుల్లో పడి గాయాలకు గురవుతున్నారు.

**న మమ్మల్ని అడగవద్దు...!**

మండల ఆర్అండ్‌బీ శాఖ పోస్టు ప్రస్తుతం ఇన్‌చార్జితో సాగుతోంది. ప్రస్తుతం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారికి ఏకంగా మూడు మండలాలు ఇచ్చారు అంటే ఆ శాఖ పనితీరు ఎలా ఉంటుందో అవగతం చేసుకోవాలి. సార్ రోడ్లు అధ్వానంగా ఉంది...కాస్త...మరమ్మతులు చేయండి అని ఎవరైనా అడిగితే నిధులు లేవు మమ్మల్ని ఏమీ అడగవద్దు. సాంక్షన్ అయిన పనులు మాత్రమే చేస్తాం ఆ పనులు చేయడం కూడా మాకు కష్టమే అంటూ ఆర్అండ్‌బీ శాఖ అధికారులు చెప్పుకొస్తుండడం ఆలోచించాల్సిన అంశం. మా కుర్చీ మా పదవి...మా ఆధిపత్యం అంటూ కొందరు...నేనే అంతా....ప్రతి సమస్యకు వినతులు ఇస్తున్నా అంత వరకే నా బాధ్యత అంటూ మరికొందరు ఉండిపోతున్నారు. ఇక ఇన్‌చార్జి మంత్రి విషయానికొస్తే నియోజకవర్గ స్థాయిలో ఒక్క సమీక్ష సమావేశం కూడా ఇంత వరకు ఏర్పాటు చేయకపోవడం మూలంగా ఎక్కడి సమస్యలు అక్కడే వినతులు ప్రభుత్వ కార్యాలయం వరకే పరిమితం అవుతున్నాయి. చూద్దాం...ఇకనైనా అధికారుల్లో చలనం ఏ మేరకు వస్తుందో చూడాలి మరి..!!

## కలెక్టరేట్‌లో పెన్షన్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

తిరుపతి కలెక్టర్, ఆగస్టు 25 ప్రభాతవార్త ః



కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల పెన్షన్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరిగింది. ఈ కార్యక్రమానికి 321 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీకి మొదటి ప్రాధాన్యత ఇచ్చి అర్జీలకు ఇచ్చిన గడువులోపు పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**-ఉమ్మడి జిల్లావాసుల్లో ఆనందం**

ప్రభాతవార్త-తిరుపతి:

హిందువులకు ఎంతో ముఖ్యమైన...అన్ని వర్గాల ప్రజలనుండి తొలిపూజలందుకునే వినాయకుడి పూజా మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరాతో నిర్వాహకులు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వినాయకచవితి పర్వదినానికి వారం రోజులముందు నుండే సందడి మొదలవుతుంది. విగ్రహాల ఏర్పాటుకు మండపాలు నెలకొల్పడం, వాటికి పోలీస్,రెవెన్యూ,విద్యుత్‌శాఖల నుండి అనుమతులు తీసుకోవడం వంటివి హడావిడి నిర్వాహకుల్లో నెలకొంటుంది. ఈ ఏడాది ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందస్తు సూచనలతో రాష్ట్రమంత్రి నారాలోకేశ్ చొరవతో వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందుకు విద్యుత్‌మంత్రి రవికుమార్ కూడా సానుకూలంగా స్పందించడంతో వినాయకుని భక్తులకు శుభవార్తగా మారింది. ఒక్కోమండపం వద్ద పలురకాలుగా నిర్వాహకులు విద్యుద్దీపాల అలంకరణలను శోభాయమానంగా తీర్చిదిద్ది వేడుకలు జరుపుకోనున్నారు.

## అక్రమ ఇసుక రవాణాతో
# రోడ్లు ధ్వంసం: ప్రజాజీవనం అస్తవ్యస్తం





తొట్టంబేడు,ఆగస్టు 25 ప్రభాతవార్త

మండలంలో ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది కొందరు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తుంది. ఈ మండలం ఇసుక,మట్టి అక్రమ రవాణాలకు నిలయంగా మారింది.శ్రీకాళహస్తి నుంచి తొట్టంబేడు మండలంలో స్వర్ణముఖి నది ప్రవహిస్తుంది. ఈ నదిలోని కనపర్తి చేమూరు గ్రామాలు ఇసుక అక్రమ రవాణాకు నిలయంగా మారింది. స్వర్ణముఖి నది పై నిర్మించిన తెలుగుగంగ కాలువ సమీపంలోని నది అక్రమ సంపాదన పరులుగా 'సిరులు కురిపిస్తుంది.' అయితే సమాజం ఏమైతే మనకేంటి అన్నట్లు అక్రమార్కులు భావించి జేబులు నింపుకుంటున్నారు.

**పగలు,రేయి తేడాలేకుండా:**

స్వర్ణముఖి నది నుంచి అక్రమార్కులు పగలు రేయి తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగింటటానికి కారకులౌతున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారింది. భూగర్భ జలాలు అడుగింటి పోతుండగ భూమి కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరివాహక ప్రాంతంలో సస్యశ్యామలంగా పంటలు పండించే భూములు బీడు భూములుగా మారే ప్రమాదం ఉంది.అధికారులు మామూళ్ళమత్తులో ఏం జరిగితే మాకేంటి అన్నట్లు వ్యవహారిస్తున్నారే విమర్శలు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రవేశ పెడితే దానిని అక్రమార్కులు వరంగా మలచుకున్నారు. ముఖ్యంగా ఇరుపాక్షపురం ప్రాంతంలో ఉన్న స్వర్ణముఖి నదిని తోడేస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా అధికారుల సహాకారంతో రేయిం బవళ్ళు తరలిస్తున్నారు.ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించకుంటే స్వర్ణముఖి ఖాళీ రైతుల జీవితాలు బుగ్గి అన్నట్లు మారుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. మరి సమస్యకు పరిష్కారం ఎప్పుడో?

# సత్యప్రమాణాలకు నెలవు : గణనాధుని కొలువు

**-రేపటి నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు**





కాణిపాకం, ఆగష్టు 25 ప్రభాతవార్త ః

సత్యప్రమాణాలకు నెలవుగా... కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం విరాజిల్లుతోంది. జిల్లా కేంద్రానికి సుమారు 12 కిలోమీటర్లు దూరంలో బహుదానది తీరంలో వెలసిన ఈక్షేత్రం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. ఈఆలయంలో బుధవారం నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ప్రతి ఏటా ఆలయంలో 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా ఈనెల 27న వినాయకచవితి, 28న ధ్వజారోహణం, హంసవాహనసేవతో ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలు సెప్టెంబర్ 5న జరిగే ధ్వజావరోహణం కార్యక్రమంతో ముగుస్తాయి. అలాగే 6న అధికార నంది వాహనంతో ప్రారంభమయ్యే ప్రత్యేక ఉత్సవాలు 16న జరిగే తెప్పోత్సవంతో ముగియనుంది.

**ప్రమాణాల దేవుడుగా ప్రసిద్ధి...**

కాణిపాకం వినాయకుడు ప్రమాణాల దేవుడిగా ప్రసిద్ధి చెందారు. కాణిపాకంలో స్వామివారే న్యాయనిర్ణేత. స్వామివారి ఎదుట తప్పుడు ప్రమాణం చేస్తే స్వామివారే శిక్షిస్తాడని ఇక్కడి భక్తుల నమ్మకం. త్రాగుడు, దురలవాట్లకు బానిసలైనవారు స్వామివారి ఎదుట ప్రమాణం చేస్తే వాటికి దూరం అవుతారని ప్రతీతి. స్వామివారి ఎదుట సాధారణ ప్రమాణాలే కాకుండా రాజకీయ ప్రమాణాలు సైతం చేయడం విశేషం. గతంలో ఇక్కడ ప్రమాణాలను సైతం కోర్టులు కూడా ఏకీభవించేవని ఆధారాలున్నాయి.

**దినదిన ప్రవృద్ధుడు వినాయకుడు...**

కాణిపాకం వినాయకుడు నిత య్రప్రవృద్ధుడుగా అలరారుతున్నారు. స్వామివారు నిత్యం పెరుగుతున్నాడనడానికి ప్రత్యక్ష నిదర్శనం వుంది. 1947లో భక్తులు తయారుచేయించి ఇచ్చిన వెండి కవచం ప్రస్తుతం సరిపోవడంలేదు. అలాగే 2000 సంవత్సరంలో తయారుచేసిన మరో వెండికవచం, 2005లో టీటీడీ మాజీ ఛైర్మన్ దివంగత డి.కె.ఆదికేశవులు తయారు చేయించిన కవచం కూడా ప్రస్తుతం స్వామివారికి సరిపోవడంలేదు. ప్రస్తుతం ఈమూడు కవచాలను భక్తుల సందర్శనార్థం ప్రాకార మండపంలో వుంచారు. కాణిపాకం శివవైష్ణవ ఆలయాల నిలయం. ఇక్కడ శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలుగా మరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయం, శ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలు వున్నాయి. శివవైష్ణవ ఆలయాలు ఒకే చోట వున్న దేవస్థానం కాణిపాకం. దినదినాభివృద్ధి చెందుతున్న కాణిపాకం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి.

# చిత్తూరు డివిజన్
చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



కుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త: కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి అధికారయం త్రాంగం అన్ని మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్ పేర్కొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు అన్ని మౌలిక వసతులు కల్పించాలి
### - రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్

సోమవారం కడ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి.వికాస్ మర్మత్‌లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పరిశ్రమలు దోహదపడతాయన్నారు. కుప్పంలో పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు గాను రెండు యూనిట్లకు భూమి కేటాయించడం జరిగిందన్నారు. అక్కడ మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాల ఉత్పత్తి, పశుగ్రాసం ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయగా మదర్ డెయిరీ పరిశ్రమ పళ్ల గుజ్జు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా ఈ కార్యక్రమాలు పేదరిక నిర్మూలనకు ముఖ్యఉద్దేశయన్నారు. కుప్పంలో రెండు పారిశ్రామిక పార్కుల ద్వారా ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. వీటి అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ ఈ రెండు ప్రాజెక్టులతో ఎనిమిది వేల ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సమావేశంలో ఆర్డీఒ శ్రీనివాసులురాజు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సూరిబాబు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి వేగంగా ఏర్పాట్లు



చిత్తూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త: వినాయక నిమజ్జనానికి చిత్తూరు కట్టమంచి చెరువు వద్ద ఏర్పాట్లను వేగంగా, పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కట్టమంచి చెరువు కట్టపై వినాయక నిమజ్జనాల కోసం చేపడుతున్న పనులను కమీషనర్ నరసింహప్రసాద్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ లోకేష్, ఎంఇ వెంకటరామిరెడ్డిలతో కలిసి పరిశీలించారు. కమీషనర్ అధికారులతో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం తీసుకోవాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. చెరువులో వినాయకుల విగ్రహాల నిమజ్జనాలకు అవసరమైన నీటిని, ప్రత్యేక వేదికను సిద్ధం చేయాలన్నారు. అలాగే బారికేడ్ల నిర్మాణం, లైటింగ్, నీటి సరఫరా, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటుపై చర్చించారు. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేయడానికి క్రేన్లు అందుబాటులో వుంచాలన్నారు. కార్యక్రమంలో డిఇ శ్రావణి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సత్వరం సమస్యలకు పరిష్కారం
### - జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశం



చిత్తూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త: ప్రజల నుండి వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడేల్‌తో కలిసి ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి జి.విద్యాధరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తోందని, ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు సత్వరం న్యాయం చేయాలన్నారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల ప్రజల నుండి 359 అర్జీలు అందాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 258 అర్జీలు వున్నాయి. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిప్యుటీ కలెక్టర్లు విజయలక్ష్మీ, కుసుమకుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునిచే క్రీడా దుస్తులు పంపిణీ

చౌడేపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త



ఉపాధ్యాయుడు విద్యార్థులకు క్రీడాదుస్తులను ఉచితంగా పంపిణీ చేసారు. మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల ఉన్నతపాఠశాలలో అల్లూరి శరత్‌చంద్ర భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. పాఠశాలలో క్రీడకు సంబంధించిన ఎలాంటి వసతులు లేకపోవడంతో ఆయన రూ. 10వేలు విలువ చేయు క్రీడా దుస్తులను విద్యార్థులకు, పాఠశాలకందించారు. దీంతో ప్రధానోపాధ్యాయురాలు రేణక ఉపాధ్యాయ బృందం ఆయన్ను సత్కరించారు. పిఇటి రాజేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ
### - జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా



చిత్తూరుహెల్త్, ఆగస్టు 25 ప్రభాతవార్త: వినాయకచవితి పురస్కరించుకుని ఇళ్ళలో పూజించడానికి ప్రతిష్ఠించే వినాయక ప్రతిమలు మట్టితో చేసినవే ఉపయోగిచాలని జిల్లా బిజెపి సీనియర్ నాయకుడు చిట్టిబాబు కొల్లా పిలుపునిచ్చారు. గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా అవగాహన సమవేశం నిర్వహించి మాట్లాడుతూ రెండు రోజుల్లో వినాయకచవితి వుండటంతో కోలాహలం ప్రారంభమైందని బజారులో వినాయక ప్రతిమలు కొనుగోలు చేయడానికి ముందు విగ్రహాలు మట్టితో చేశారా! లేక రసాయనాలు ఉపయోగించారా! అని పరిశీలించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఉపయోగించి పెద్ద విగ్రహాలు తయారు చేస్తారని, నిమజ్జనం అనంతరం ఈ రసాయనాలు నీటిలో కలిసి భూగర్భజలాలను కలుషితం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రెడ్డి మస్తాన్, హేమంత్‌చౌదరి, హెడ్మాస్టర్ మోహన్ ఉపాధ్యాయులు వేణుగోపాల్, మనోహర్, లత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై మెరుగైన అవకాశాలు
### - ప్రభుత్వ విప్ డా.కంచర్ల శ్రీకాంత్




చిత్తూరురూరల్, ఆగస్టు 25 ప్రభాతవార్త: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీపై రానున్న కాలంలో అనేకమైన అవకాశాలు విద్యార్థుల ముంగిట వుంటాయని, వాటిని అందిపుచ్చుకోవటానికి కావలసిన నైపుణ్యాలను పెంచుకోవాలని, దానికి కావలసిన ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ఫెసిలిటీస్ అన్ని విజయం కళాశాలకు వున్నాయని ప్రభుత్వ విప్ డా. కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. సోమవారం విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం కళాశాల అధినేత డా. తేజోమూర్తి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంచర్ల శ్రీకాంత్ పాల్గొని ప్రసంగించారు. అలాగే గౌరవ అతిథి పూతలపట్టు ఎమ్మెల్యే డా. కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విజయం విద్యాసంస్థలు ఒక కల్పవృక్షమని, ఈ వృక్షం నీడలో ఫలప్రదమైన జీవితాలు మీకు అందుతాయని క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి చదువుకోగలిగితే భవిష్యత్తులో ఉద్యోగాలు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయన్నారు. అలాగే వీరితో పాటు పాల్గొన్న గ్రావిట వైస్‌ప్రెసిడెంట్ ఏపి శర్మ, ఏపిఎస్‌ఆర్టీసి చైర్మెన్ పిఎస్ మునిరత్నం, ప్రముఖపారిశ్రామిక వేత్త రేవాండ్ ఎండి దామోదరనాయుడు, టిటిడి బోర్డు మెంబరు శాంతారావు తదితరులు విద్యార్థిని, విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత డా.తేజోమూర్తితో పాటు అకడమిక్ డైరెక్టర్ డా. శైలజమూర్తి, విజయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గోపి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



తిరుచానూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి హరినాథ్, కేంద్ర సహాయక మంత్రి కిషన్ రెడ్డి వేరువేరు సమయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. వీరిని ఆలియా డిప్యూటీవో హరేంద్రనాథ్ స్వాగతించి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభాన్ని నమస్కరించి అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. తరువాత ఆశీర్వాద మండపం వద్ద డిప్యూటీవో తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమేష్, ఏవిఎస్ఓ రాధాకృష్ణమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కోటి రూపాయల నిధులపై మండల మీట్‌లో రచ్చ..రచ్చ
### - వైకాపా బహిష్కృత ఎంపిపిపై ఎంపిటిసిల తిరుగుబాటు !!

పెద్దపంజాణి, ఆగస్టు 25 ప్రభాతవార్త



మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం రచ్చరచ్చగా సాగింది. మండలానికి మంజూరైన ఒక కోటి లక్ష రూపాయల నిధుల వ్యవహారంపై సమావేశం ఆరంభంలోనే వైకాపా ఎంపిటిసిలు ప్రశ్నించారు. ఎలాంటి అనుమతులు లేకనే ఈ నిధులు ఎలా ఖర్చు చేశారని అధికారులు సరైన సమాధానం చెప్పాలని సభ్యులు పట్టుబట్టారు. వీరప్పల్లి ఎంపిటిసి సుబ్రమణ్యం మాట్లాడుతూ గతంలో తనను అవమానించిన వైకాపా ఎంపిటిసిలు ఇప్పుడు సభ మర్యాదలు, ప్రోటోకాల్ గురించి మాట్లాడడం తగదన్నారు. కాగా తాను దళితుడినని అవమానించి తనపై తప్పుడు నివేదికలు అధిష్టానానికి అందించడంతో వైకాపానుంచి సస్పెండ్ చేశారని ఇది తనకు బాధ కలిగించిందని పేర్కొంటూ ఎంపిపి రెడ్డెప్ప సభ ముగిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సభలో ఎలాంటి సమస్యల ప్రస్తావనే లేకుండా పోయింది. తదనంతరం వైకాపా ఎంపిటిసిలు ఎంపిడిఒ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఎంపిపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండలంలో పలు శాఖల్లో జరిగిన అవకవతకలు బయటపడతాయనే అర్థాంతరంగా సమావేశాన్ని ముగించారని ఇది పద్ధతి కాదని ఆగ్రహించారు. అనంతరం ఎంపిపి రెడ్డెప్ప, డిప్యూటీ ఎంపిడిఒ శారదా దేవి మాట్లాడుతూ 99.22లక్షలతో మండలంలో 47పనులకు గాను 42 పనులు పూర్తయ్యాయన్నారు. ఈపనులు ఎంపిటిసిల ఆమోదంతో చేపట్టామన్నారు. సమావేశంలో తహశీల్దార్ హనుమంతు, పిఎసిఎస్ అధ్యక్షుడు శ్రీరాములు, జడ్పీటిసి సుష్మ, ఎస్సై ధనుంజయరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

## వీధివీధినా వినాయకుని విగ్రహాలు

పలమనేరు, ఆగస్టు 25, ప్రభాతవార్త: ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా పలమనేరులో వీధివీధినా వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నిర్వాహకులు చందాల వసూళ్ళతో మునిగి తేలుతున్నారు. చలువ పందిళ్ళు షామియానాలు వేసి విద్యుత్ లైట్లతో అలంకారాలు చేస్తున్నారు. ఇక పండగను దృష్టిలో వుంచుకొని సైజును బట్టి ఒక్కో విగ్రహం ఖరీదు వేలల్లో ధరలు పలుకుతున్నాయి. చిన్న విగ్రహాలు అంటే 2 అడుగుల ఎత్తుగలవి రూ.10 వేల నుండి రూ.20 వేల వరకు ధర ఉండగా 5 అడుగులు అంతకు మించిన విగ్రహాలు రూ.75 వేల నుండి రూ.లక్ష, రూ.లక్షన్నర పైగా ధరలు పలుకుతున్నాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, అనంతపురం, కర్నూలు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి ఈ విగ్రహాలను లారీలో తెప్పించుకుంటున్నారు. పలమనేరులోనూ కొత్తగా విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇక పండుగ రోజు స్థానిక గంగమ్మ తోపులో పలమనేరు పరిరక్షణ సమితి జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల అమ్మకాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సామాన్య ప్రజలను దృష్టిలో వుంచుకొని తక్కువ ధరలకే విగ్రహాలు విక్రయించాలని నిర్ణయించారు.

## ఘనంగా శ్రీ గంగమ్మ ఆలయ కుంబాభిషేకం

రామకుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త



స్థానికంగా నెలకొన్న శ్రీ గంగమ్మ ఆలయ కుంబాభి షేక కార్యక్రమాలు సోమవా రం ఘనంగా జరిగాయి. కలశస్థాపన, గణపతి హో మం, చండీయాగం, కుంబా భిషేక కార్యక్రమాలు వేదపం డితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. కార్య క్రమానికి చుట్టుపక్కల గ్రామాలను ంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో నేతలు ఆనందరెడ్డి, సీతాపతి, చిన్నికృష్ణ, గు ర్రప్ప, కామరాజునాయక్, వెంకటరమణ, బాలరాజు, సుబ్రి, సాగర్ రెడ్డి, ఆదిల్, సురేష్, సుభాష్, అర్చకులు నాగరాజస్వామి, సందీప్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఇంజనీర్లను తయారుచేయడమే లక్ష్యం
### - బిసిఎన్ గ్రూప్స్ చైర్మన్ బిసి నాగరాజ్



కుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త సమాజానికి ఉత్తమ ఇంజనీర్లను అందించడమే తమ లక్ష్యమని బిసిఎన్ గ్రూప్స్ చైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. సోమవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో బి.టెక్ ఫస్టియర్ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన స్నేహపూరిత, క్రమశిక్షణ తో కూడిన క్యాంపస్ తమ కళాశాల సొంతమన్నారు. గ్రామీణ విద్యార్థులను భవిష్యత్తు ఇంజనీర్లుగా తయారు చేయడంతో పాటు వారికి దేశ విదేశాల్లో ప్రసిద్ధి చెందిన సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో తమలోని నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ డా॥ సునీల్ రాజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తాను అనుకున్న లక్ష్యాలు సాధించే దిశగా స్థితో చదివి విజయం సాధించాలని సూచించారు. ప్రతికూల పరిస్థితులకు లొంగరాదని ముందుకుసాగాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన మాతృభూమి డైరెక్టర్ నాగప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాభివృద్ధిపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్,మాధవన్, హెచ్‌ఓడిలు, అధ్యాపకులు, పిఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థుల జీవితాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ వెలుగులు
### - ఉచిత డిఎస్సీ శిక్షణతో 15మందికి ఉద్యోగాలు !!

కుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడుసతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం ప్రాంతంలోని పలు నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారు. దీంతో ఆ కుటుంబాలు ఆనంద భరితులై సిఎం చంద్రబాబునాయుడు, నారా భువనమ్మకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. నారా భువనేశ్వరమ్మ ఆదేశాలతో కుప్పంలో నిరుద్యోగ యువతకు డిఎస్సీ ఉచిత శిక్షణ కల్పి ంచారు. ఈ శిక్షణ తరగతులకు సుమారు 80మంది హాజరు కాగా వారిలో 15మందికి పైగా ఇటీవల నిర్వహించిన మెగా డిఎస్సిలో అత్యుత్తమ ప్రతిభ చూపి ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున వేలాది రూపాయల విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా అందించడంతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులచే వారికి డిఎస్సీ శిక్షణ ఇచ్చారు. దీంతో ప్రతిభ చూపిన పదిహేను మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఓ పక్క డిఎస్సీ ఉచిత శిక్షణతో పాటు మరో పక్క మహిళలు సొంతంగా తమ కాళ్లపై తాము ఆర్థికంగా నిలబడేందుకు నారా భువనమ్మ కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఉచిత కుట్టు శిక్షణ, అల్లికల కేంద్రాన్ని సైతం ప్రారంభించారు. ఇక్కడ కూడా నిరుపేద మహిళలు కుట్టు శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పూర్తయిన మహిళలకు ట్రస్ట్ తరపున ఉచితంగా కుట్టుమిషన్లను నారా భువనమ్మ అందిస్తున్నారు. మానవసేవే మాధవ సేవ స్ఫూర్తితో ముందుకుసాగుతున్న నారా భువనమ్మకు నిరుపేద కుటుంబాలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు : ఎస్.ఐ నాగేశ్వరరావు

చౌడేపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త

వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నందు మండలంలోని మతపెద్దలతో వినాయక చవితి వేడుకలపై ప్రభుత్వ నిబంధనలను గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత మండపాలు ఏర్పాటు చేసుకొనే క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ వైర్లు లేకుండా చూసుకోవాలన్నారు. మరిన్ని జాగ్రత్తలను వివరించారు.

## రేపు మంత్రిచే గణనాథునికి పట్టువస్త్రాల బహూకరణ

కాణిపాకం, ఆగస్టు 25 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం వినాయకచవితి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ప్రతి ఏటా ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ అని తెలిపారు. ఈమేరకు బుధవారం వినాయకచవితి సందర్భంగా మంత్రి రాంనారాయణరెడ్డి కాణిపాకం చేరుకుని స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌తో కలసి స్వామివారికి పట్టువస్త్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.

## కాణిపాకం ఆలయానికి లగేజి ఆటో విరాళం



కాణిపాకం, ఆగస్టు 25 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు ఓ భక్తుడు సోమవారం లగేజి ఆటోను విరాళంగా అందజేశారు. ఈమేరకు చిత్తూరు శ్రీనివాస మోటార్స్ అధినేత జీవరత్నం రెడ్డి అనే భక్తుడు సుమారు 3.40 లక్షలు విలువ గల లగేజి ఆటోను విరాళంగా అందజేశారు. దేవస్థానం లడ్డూ పోటులో వినియోగించుకునేందుకు అవసరమైన ఈఆటోను దాతలు ఆలయ ఈఓ రవీంద్రబాబుకు అందజేశారు.దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



పాకాల, ఆగస్టు 25 ప్రభాతవార్త పాకాల పంచాయతీ గుట్ట కింద ఇండ్లులో కూటమి ప్రభుత్వం నూ తనంగా ప్రవేశ పెట్టిన ఏ.టీ.ఎం కార్డు తరహాలోని నూతన స్మార్ట్ రేషన్ కార్డులను చంద్రగిరి శాసన సభ్యులు పులివర్తి నాని సోమవారం రోజున లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పాకాల మండలంలోని 41 రేషన్ షాపులకు 15693 స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం. ఈ స్మార్ట్ కార్డు ను స్కాన్ చేస్తే కార్డులోని లబ్ధిదారుల వివరాలు ఎన్ని కేజీలు బియ్యం, ఇతర వస్తువులు మరియు కుటుంబ సభ్యులు వివరాలు చూపిస్తుంది అని వారు తెలియజేసారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విధా నంలో రాజ ముద్రతో కూడిన నూతన శీలి కోడ్ ద్వారా రేషన్ కార్డులను తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమా రు 5.లక్షల 80 వేల లబ్ధిదారులతో 120 రేషన్ షాపులలో అలాగే రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పంపి ణీ చేయడం మొదలు కావడం శుభ పరిణామం అని ఎమ్మెల్యే తెలియజేశారు. మండల స్థాయి అధికారులు, రేషన్ డీలర్లు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సేనతో సేనాని సభను విజయవంతం చేయండి

కాణిపాకం, ఆగస్టు 25 ప్రభాతవార్త: జనసేన రాష్ట్ర అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుండి 30 వరకు విశాఖపట్నంలో జరిగే సేనతో సేనాని సభను విజయవంతం చేయాలని జిల్లా జనసేన నాయకులు ఎం.మహేష్‌స్వేరో తెలిపారు. జనసేనాని పవన్ కళ్యాణ్ దాదాపు 14 వేల పైచిలుకు క్రియాశీలక వాలంటీర్లుతో ముఖాముఖీగా మాట్లాడే ఈకార్యక్రమంలో అందరూ పాల్గొని భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలని తెలిపారు. ఈమేరకు కార్యక్రమంలో జిల్లా నుండి క్రియాశీలక సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని సభను విజయవంతం చేయాలని తెలిపారు.

## ఏటిఎంలాగా స్మార్ట్ రేషన్ కార్డు



భాకరాపేట, ఆగస్టు 25 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కూటమి నేతలు తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండల కేంద్రం లో సోమవారం తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పాత రేషన్ కార్డు స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు ప్రవేశపెట్టడం వాటి ప్రయోజనాలను వివరించారు. ఇదివరకే రేషన్ కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి తమ సిబ్బంది స్మార్ట్ రేషన్ కార్డులను వారి ఇంటికి వద్దకే చేరుస్తారని తెలిపారు. ఎవరికైనా స్మార్ట్ రేషన్ కార్డులు అందని పక్షంలో మరియు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అర్హత గల ప్రతి ఒక్కరికి రేషన్ కార్డును ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినాదని తెలిపారు.ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షుడు దండు కిషోర్, జనసేన మండల అధ్యక్షులు దూది యస్వంత్,టీడీపీ మండల అధ్యక్షులుబెల్లంకొండ మురళి, ఎంపీటీసీ విజయశేఖర్ గౌడ్ మాజీ సర్పంచిలు కొట్టే శివకుమార్, సుబ్రహ్మణ్యం,సంద్ర మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలకు కృషి చేద్దాం



కల్లూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను నెరవేరుస్తూ అంబేద్కర్ నిర్దేశించిన మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధికి ముందుంటున్నామని దళిత సంఘాల నాయకులు గురు స్వామి, క్రాంతి కుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, నారాయణ అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోని గ్రామ సచివాలయాలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చిత్రపటాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇనయతుల్లా, దళిత సంఘాల నాయకులు రాధాకృష్ణ, అభిరామ్, జ్యోతిష్ కుమార్, సహదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

వి.కోట, ఆగస్టు 25 ప్రభాతవార్త

స్థానిక ప్రభుత ్వ జూనియర్ కాలేజ్‌లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల కోసం ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి కోరారు. హెచ్ఇసి, ఎకనామిక్స్ సబ్జెక్టులను ఉర్దూ మాధ్యమంలో బోధించుటకు అలాగే ఎంపిహెచ్‌డబ్ల్యు (ఎఫ్)నర్సింగ్ గ్రూప్‌లో బోధించుటకు యాభైశాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఈనెల 30వతేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## పలమనేరులో 5 మంది బైండోవర్

పలమనేరు, ఆగస్టు 25, ప్రభాతవార్త: ఈ నెల 27న వినాయక చవితి పురస్కరించుకొని పలమనేరులో 5 మందిని బైండోవర్ చేసినట్లు సిఐ నరసింహరాజు తెలిపారు. గత ఏడాది వినాయక చవితి సందర్భంగా వీరంతా గొడవలు చేశారని దీంతో డిఎస్పీ ప్రభాకర్ ఎదుట హాజరుపరచి కౌన్సిలింగ్ ఇచ్చామని అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. చవితి సందర్భంగా ఎవరైనా గొడవలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆర్వీటీ బాబుచే వినాయక విగ్రహాలు బహూకరణ



చౌడేపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త నియోజకవర్గ తేదేపా నాయకుడు ఆర్వీటీ బాబుచే యువతకు వినాయక విగ్రహాలను బహూకరించారు. చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లి వద్దగల వినాయక విగ్రహాల తయారీ కేంద్రం వద్దకు పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల మండలాలకు చెందిన దాదాపు 200 గ్రామాలకు ఆయన వినాయక విగ్రహాలను ఉచితంగా అందించారు. వినాయక చవితి అధిక ఖర్చుతో కూడుకున్నది కాబట్టి తనవంతు సాయంగా విగ్రహాలందిస్తున్నట్లు ఆర్వీటీ బాబు వర్గాలు తెలిపాయి. ఆయన వ్యక్తిగత కార్యదర్శి దివాకర్, స్థానిక నాయకుడు గిరినాయుడు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన యువజనులు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లు

శాంతిపురం, ఆగస్టు 25 ప్రభాతవార్త : పేదల ఆకలి తీర్చేందుకే సిఎం చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేయిస్తున్నారని ప్రభుత్వ విప్ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద 60లక్షలతో నిర్మించనున్న నూతన అన్న క్యాంటీన్ భవనానికి ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అన్న క్యాంటీన్లు డిసెంబర్ కల్లా ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం , టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, గోపాల్, రాజు, బాలు, రమేష్, చిట్టినాయుడు, రాజారెడ్డి, శ్యామలమ్మ, రూప, హరిత, హేమ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

# సాంకేతిక రంగంలో పరుగులు తీయిస్తున్న సిఎం



తొట్టంబేడు,ఆగస్టు 25 ప్రభాతవార్త: రాష్ట్రాన్ని సాంకేతిక రంగంలో పరుగులు తీయిస్తూ యువతకు అండగా నిలుస్తున్న బాసటగా పథకాలను రూపొందించి అమలుపరుస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జనం గుండెల్లో శాశ్వతంగా నిలుస్తున్నారని మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ అన్నారు. సోమవారం మండలంలోని చేమూరులో స్మార్ట్ కార్డుల కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో మండ పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు, చోడవరం చంద్రారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కొన్నలి రమేష్, భాస్కర్ నాయుడు, రాఘవరెడ్డి, గున్నయ్య, శంకర్‌నాయుడు సచివాలయ సిబ్బంది, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు. కాగా కన్నలి గ్రామంలో స్మార్ట్ కార్డుల పంపిణిని కన్నల ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

కాగా మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కొణతనేరి పంచాయతీలో స్మార్ట్ కార్డుల పంపిణి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఇలగనూరు, గుర్రప్పనాయుడు కండ్రిగ, బసవయ్య పాళెంలలో స్మార్ట్ కార్డుల పంపిణి చేపట్టారు. ఈ కార్యక్రమాలను న్యాయవాది కమలాకర్, విఆర్ఓ రవి, ఆయకట్టు ఛైర్మెన్ దావులూరు సుశేఖర్ నాయుడు, డీలర్ భాను మతి, సింగమాల భాస్కరయ్య, శంకర్‌నాయుడు, గుడ్ల ఉష, వెంకటకృష్ణయ్య, భూదేవి, రామయ్య, పానకం మునిరత్నం, రమణమ్మ, సురేష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. బసవయ్యపాళెంలో కమలకుమార్, విఆర్ఓ రవి, బాలకృష్ణ, డీలర్ ముత్తులక్ష్మీ, తెలుగుదేశం నాయకులు రామయ్య, గుర్రుప్ప, సీతారామయ్య, దాము, వవెంకటరరామయ్య, ప్రజలు పాల్గొన్నారు.

## వేడుకలకు అనుమతులు తప్పనిసరి

వెదురుకుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త : వినాయక చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పురష్కరించుకుని వినాయక విగ్రహాలను మండపాలలో ప్రతిష్టించి ఉత్సవాలు జరుపుకోదలచిన మొబైలల్ నంబర్ ద్వారా అప్లై చేసుకుని నమోదు చేసుకోవాలన్నారు. నిబంధనలకు లోబడి వేడుకలు జరుపుకోవాలని గుర్తించాలని చూచించారు.

## ప్రింటర్ దొంగ అరెస్టు



వెదురుకుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త : సచివాలయంలో ప్రింటర్ దొంగ తనంకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసిన్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య సోవారం తెలిపారు. మండలంలోని కొమరగుంట రైతు సేవ కేంద్రంలో ఇటీవల ప్రింటర్ చోరీకి గురికావడం జరిగిందన్నారు. ఆ మేరకు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. ప్రింటర్ దొంగతనంకు పాల్పడిన పచ్చికాపల్లం హరిజనవాడకు చెందిన మురళిని అదుపులోకి తీసుకుని విచారించి అరెస్టు చేయడంతో పాటు పుత్తూరు కోర్డుకు హాజరుపరచడం జరిగిందన్నారు. సీజే ముద్దాయికి రిమాండ్ ఆదేశించిన్నట్లు తెలిపారు.

## ఏడు మండలాల్లో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ



నారాయణవనం, ఆగస్టు 25 ప్రభాతవార్త : సత్యవేడు నియోజకవర్గం లోని ఏడు మండలాలు సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కెవిబి పురం, వరదయ్య పాలెం, బుచ్చి నాయుడుకండ్రిగ మండలాల్లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సుడిగాలి పర్యటన చేసి రెవెన్యూశాఖ ద్వారా అందించిన రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ముందు నారాయణవనం తహశీల్దారు కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యవసర సరుకులను పొందే లబ్దిదారులకు ఈ స్మార్ట్ కార్డులతో సులభంగా సరుకులను పొందవచ్చున్నారు. ఇకపోతే రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా ఈ సరుకును పొందవచ్చున్నారు. అనంతరం లబ్దిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. అనంతరం పంచాయతీ ఇఒ షణ్ముగం తన సిబ్బందితో వాహనాల పార్కు కోసం తహశీల్దారు కార్యాలయం వద్ద శుభ్రం చేసిన స్థలాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, మాజీ నెడ్‌క్యాప్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, మాజీ ఎంపిపి పి గోవిందస్వామి, ఏపి భక్తవత్సలం, మాణిక్యంరెడ్డి, సర్పంచ్ కె శారదమ్మ గణేషన్, రమేష్‌బాబు, మాజీ సర్పంచ్ కెఎస్ రవిరెడ్డి, శంకరయ్య, డిఎస్ఒ, తహశీల్దారు రోజారాణి, ఇ ఒకా నాయకులు ఊరప్ప, కుట్టి బాలయ్య, మోహన్, సోడా మణిరెడ్డి, సొరకాయులు, గా ండ్ల కె శివకుమార్, దేవరాజులు, బాలమురుగన్, రవిరెడ్డి, నాగరాజు, వి సుబ్రమణ్యం, మురళి తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



వడమాలపేట, ఆగస్టు 25 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన వడమాలపేటలో అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు రేషన్‌కార్డు అవసరమని గుర్తించిన ప్రభుత్వం క్యూ ఆర్ కోడ్ విధానంతో స్మార్ట్ రేషన్ కార్డులు రాష్ట్రవ్యాప్తంగా అందజేస్తున్నదన్నారు. వడమాలాపేట 9,506 స్మార్ట్ రేషన్‌కార్డులు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన వారందరికి ఇంటి వద్దే కార్డులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జరీనా, టీడీపీ నాయకులు ధనంజయలునాయుడు, దాము యాదవ్, లక్ష్మిప్రసన్న, శివరాయల్, కుమార్, హేమావతి, గురునాథం శెట్టి, డిల్లీ ప్రసాద్, జనార్ధన్, బత్తినాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్టాండులో న్యాయవిజ్ఞాన సదస్సు



శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండు ఆవరణలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. న్యాయవిజ్ఞాన సదస్సుల్లో భాగంగా కమిటి సారథ్యంలో ప్రయాణీకులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాల్యవివాహాలకు సంబంధించి, నిర్మూలన చట్టం గురించి వివరించారు. నేడు సమాజంలో చోటు చేసుకున్న జాడ్యం మైనారిటి తీరకముందే కొన్ని వివాహాలను చేస్తున్నారని ఇది ఆరోగ్యరీత్యా కూడా ఇబ్బంది కల్గిస్తుందని రాజేశ్వరరావు వివరించారు. ఈ దురాచారాన్ని రూపుమాపుటకు తల్లిదండ్రులు చైతన్యవంతులు కావాలని ఆయన సూచించారు. ఈ చైతన్య సమావేశంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, అరుణ్, శ్రీరామ్, సిబ్బంది శంకర్ తదితరులు ఏర్పాటు చేసారు. డిపో మేనేజర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## శివయ్య సేవలో కర్నాటక హైకోర్టు జడ్జి



శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త: వాయులింగేశ్వరుని సేవలో సోమవారం కర్నాటక హైకోర్టు జడ్జి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఎఇఒ మోహన్ వేదపండితులతో స్వాగతం పలికారు. జస్టిస్ సిఎంజోషి కుటుంబసభ్యులతో రాగా వారికి స్వాగతం పలికారు. ఏర్పాట్లును ఎఇఒ మోహన్, ఎస్ఒ నాగభూషణం యాదవ్,ఎపిఆర్ఒ రవి కోర్టు సిబ్బంది పాల్గొన్నారు

## తల్లిదండ్రుల కలలుసాకారం చేయాలి: కోలా



శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త: ఎన్నో ఆశలతో తల్లిదండ్రులు కాయ కష్టం చేస్తూ, చేయింబవళ్ళు కష్టిస్తూ తమ బిడ్డలను చదివించుకొనుటకు శ్రమిస్తున్నారు. వారి కలలను సాకారం చేయటానికి పిల్లలు కష్టించి చదివి మంచిపేరు తీసుకురావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. సోమవారం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛందసేవా సంస్థ గిరిజన బాలికల గురుకులం వసతి గృహంలో విద్యార్థులకు మంచినీళ్ళ బాటిల్స్‌ను పంపిణి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఇక శ్రీకాళహస్తిలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో గరికపాటి రమేస్‌బాబు, కొట్టేసాయి, మునీర్‌బాషా, కుమార్, వజ్రం కిషోర్, గరికపాటి చంద్ర, సొట్టకుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల్ని పరామర్శించిన బృందమ్మ



తొట్టంబేడు, ఆగస్టు 25 ప్రభాతవార్త: మండలంలోని కాసరం పంచాయతీకి చెందిన మాజీ జడ్‌పిటిసి ధనలక్ష్మీ ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఇంటిలో ఉండటంతో సోమవారం బొజ్జల బృందమ్మ పరామర్శించారు. ఆర్ధికంగా వారు నిరుపేదలు కావటంతో వారికి ఆర్థిక సహాయం అందించారు. ఆమెతో పాటు పార్టీ అధ్యక్షుడు రావిళ్ళమునిరాజానాయుడు, భాస్కర్‌నాయుడు కొన్నల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్కుర్తిలో స్మార్ట్ కార్డుల పంపిణి



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలో సోమవారం ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాలను ఓ పండగ వాతావరణంలో నిర్వహించారు. ఇక్కడ మండల పార్టీ అధ్యక్షుడు అక్షింతల కృష్ణయాదవ్ సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు బొజ్జల బృందమ్మ ముఖ్యఅతిధిగా వచ్చారు. ఈ సమావేశాన్ని మండల తహశీల్దార్ జనార్ధన్‌రాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతులకు జీలగలను సబ్సిడీ పద్ధతిపై పంపిణి చేసారు. ఈ కార్యక్రమాల్లో మార్కెటింగ్ కమిటి చెంచయ్యానాయుడు, జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి, తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, బత్తిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏర్పేడులో స్మార్ట్ కార్డుల పంపిణి



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో ప్రభుత్వం రూపొందించిన స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాలను మండల పార్టీఅధ్యక్షుడు పేరం నాగరాజనాయుడు సారథ్యంలో ఏర్పాటు చేసారు. తహశీల్దార్ భార్గవి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో నాగరాజు నాయుడు మాట్లాడుతూ ఏర్పేడు మండలంలో ప్రభుత్వ పథకాలతో సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. మండలంలో విమానాశ్రయం పరిశ్రమలతో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తున్న ఘనత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డిది అన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు మోహన్‌రావు, పొన్నారావు, కృష్ణావేణి, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్‌గా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి



తిరుపతిరూరల్,ఆగస్టు24 ప్రభాతవార్త: ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత మెరుగైన పారదర్శకతను పాటిస్తూ కూటమి ప్రభుత్వం లబ్దిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణి చేస్తుందని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి తెలిపారు. క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం తిరుపతిరూరల్ మండలం మల్లంగుంట గ్రామ పంచాయతీలో పంపిణి చేసారు. ఈసందర్భంగా ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ క్యూఆర్ కోడ్‌తో రేషన్‌కార్డుదారుని వివరాలు, రేషన్ ఎప్పుడు ఎక్కడ తీసుకున్నారు అనే వివరాలు స్పష్టంగా తెలుస్తాయని తెలిపారు. తిరుపతిరూరల్ మండలంలో 31,036 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లంగుంట సింగిల్‌విండో ఛైర్మెన్ మధుశేఖర్, టిడిపి నాయకులు పార్లపల్లి ముని కృష్ణారెడ్డి, దిలీప్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి ముత్యాలలక్ష్మీ, విఆర్వో రమేష్ లు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి



తిరుపతిరూరల్,ఆగస్టు25 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం లబ్దిదారులకు మెరుగైన సేవలు అందించుటకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి చేస్తున్నట్లు టిడిపి సీనియర్ నేత నాగూరు శ్రీనివాసులు తెలిపారు. రేషన్ పంపిణిలో అవకతవకలు జరగకుండా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా పారదర్శకంగా లబ్దిదారులకు రేషన్ సరుకులు పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్వో శివ, టిడిపి నాయకులు కాయం వెంకటేష్, నటరాజ్, మల్లిఖార్జున, కిరణ్, చిన్ని, నాగరాజ, లక్ష్మీప్రసన్న, సుమతి, చంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు

## జేబుల్లో పెట్టుకునే డిజిటల్ రేషన్‌కార్డులు



తిరుపతి,ఆగస్టు 25ప్రభాతవార్త: ప్రజలు సులభంగా జేబుల్లోపెట్టుకుని అవసరాలకు వినియోగించుకునే రీతిలో డిజిటల్ రేషన్‌కార్డులు ప్రభుత్వం జారీచేయడం బావుందని పలువురు లబ్దిదారులు తెలిపారు. ఏదేని శాశ్వత చిరునామా కోసం ఈ కార్డులు అవసరానికి జేబుల్లోఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీనివాసులు, వి.పుష్పావతి యాదవ్. దంపూరిభాస్కర్‌యాదవ్, కుమారమ్మ, తహశీల్దార్ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి హెల్త్, ఆగస్టు 25 ప్రభాతవార్త : స్విమ్స్‌కు వినాయక చవితి పండుగ సందర్భంగా బుధవారం రోజున ఓపీ, ఓటీలకు సెలవు దినంగా ప్రకటించినట్లు స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్విమ్స్ అత్యవసర విభాగపు (క్యాజువాలిటీ)సేవలు యథాతథంగా కొనసాగుతాయన్నారు. ప్రజలకు, పేషంట్లకు ఈ విషయాలు గుర్తించుకోవాలని సూచించారు.

## జాతీయ నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహన



తిరుపతి హెల్త్, ఆగస్టు 25 ప్రభాతవార్త : ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి నేత్ర విభాగపు నందు జాతీయ నేత్ర దానా పక్షోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నేత్రదానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి నేత్రదానం వలన కలిగే ప్రయోజనాలను నేత్ర విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నేత్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్య విద్యార్థులు, నేత్ర విభాగ టెక్నీషియన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## చవితికి సూచనలను తప్పక పాటించాలి: సిఐ



తిరుచానూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త : తిరుచానూరు స్టేషన్ పరిధిలో వినాయక చవితి విగ్రహాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా పోలీసులకు తెలియజేసి నిబంధనలతో కూడిన అనుమతులను పొందాలని తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ సూచించారు. రానున్న వినాయక చవితి సందర్భంగా పాటించవలసిన నిబంధనలు సూచనలు పత్రికా ప్రకటన ద్వారా తన స్టేషన్ పరిధిలోని భక్తులకు ప్రజలకు తెలిపారు. ఇందులో భాగంగా సీఐ మాట్లాడుతూ తమ తమ ప్రాంతాలలో ఏర్పాటు చేసినటువంటి విగ్రహాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ డీజే సౌండ్లు పెట్టరాదని వాటిని పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలకి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల వినాయక విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ కార్డు



చంద్రగిరి, ఆగస్టు 25 ప్రభాతవార్త: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడిన స్మార్ట్ కార్డులను రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ శివరామసుబ్బయ్య అన్నారు. మండల వ్యాప్తంగా సోమవారం ఇంటింటికీ వెళ్ళి నేరుగా లబ్దిదారులకే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక కొత్తపేటలో స్మార్ట్ కార్డుల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవడంలో భవిష్యతరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మండలంలో మొత్తం 16953మంజూరు కాగా మొదటి రోజు 1898 కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గౌస్‌భాషా, సింగిల్‌విండో ఛైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు చక్రవర్తి రెడ్డి, నాయకులు మంగాపురం లోకేశ్వరీ భాస్కర్ రాయల్, గోపి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ రేషన్‌కార్డులో లబ్దిదారులకు మేలు



తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి: ప్రభుత్వం మంజూరుచేసిన డిజిటల్ రేషన్‌కార్డులతో లబ్దిదారులకు మేలుచేకూరుతుందని టిడిపి తిరుమల విభాగం అధ్యక్షుడు రాజుయాదవ్ తెలిపారు. తిరుమలలోని బాలాజీనగర్‌లో నివాస ముంటున్న స్థానికులకు ప్రభుత్వం మంజూరు చేసిన 153 డిజిటల్ రేషన్ కార్డులను సోమవారం టిడిపి రాజుయాదవ్,పార్టీ ప్రధాన కార్యదర్శి శివషణ్ముగం, కూటమి కార్యకర్తలు పాల్గొని ఇంటింటికి వెళ్ళి ప్రజలకు అందజేశారు. లబ్ధిదారులు ఈ కార్డులను జేబులో పెట్టుకుని అందుబాటులో అవసరానికి వినియోగించుకోవచ్చున్నారు.

## స్మార్ట్ కార్డు ఎంతో ఉపయోగకరం: ఆర్‌డిఓ



శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని వాడ వాడల్లో సోమవారం ప్రభుత్వం నూతనంగా రూపొందించిన స్మార్ట్ కార్డులను పంపిణి చేసారు. ఈ కార్యక్రమాలను శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దుబారాలను అరికడుతుందన్నారు. ప్రస్తుతం జారి చేసిన స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆర్‌డిఓ వివరించారు. ఆయన మాట్లాడుతూ ఈకార్డును ఉపయోగించి రాష్ట్రంలో ఎక్కడైనా నిత్యావసర సరకులు తీసుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిధిగా బొజ్జల బృందమ్మ హాజరయ్యారు. 11వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్,పట్టణ కార్యదర్శి కాసరంరమేష్, తిరుపతి పార్లమెంట్ కోశధికారి కంఠ రమేష్,రేషన్ డీలర్ వివేక్‌గౌడ్, వాకచర్ల గుర్రప్పశెట్టి, డివి.నారాయణ,కిట్టు, మల్లీశ్వరమ్మ, సుమతి,కోరా రాకేష్,మస్తాన్, ఎంపి సీను, బాబునాయుడు,సురేష్, బద్రి, కిషోర్, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 29న హుండీల లెక్కింపు:

శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని స్వామి అమ్మవార్లు, పరివార దేవతల హుండీల్లో సమర్పించిన కానుకలను ఈ నెల 29న హుండీలను లెక్కించనున్నట్లు ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి వివరించారు. ఏ నెల కానెల హుండీల ఆదాయాలు పెరుగుతున్నాయని ఇఒ వివరించారు. ఈ నెల 29న ఉదయం 7గంటలకు పాత ఇఒ కార్యాలయం మ ఒదుకొట్టు మండపంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. సిబ్బంది నిబంధనలను పాటిస్తూ హాజరు కావాలని ఆయన కోరారు.

## పారదర్శకంగా పంపిణీ కోసమే స్మార్ట్ కార్డులు



తిరుపతి విద్య, ఆగస్టు 25 ప్రభాతవార్త: క్యూఆర్ కోడ్ ఆధారిత రేషన్ కార్డులను సోమవారం ఉదయం ఎన్జీఓ కాలనీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. పాత రేషన్ కార్డుల స్థానంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. క్యూఆర్ కోడ్ తో రేషన్ కార్డు దారుని వివరాలు, రేషన్ ఎప్పుడు, ఎక్కడ తీసుకున్నారు అనే వివరాలు స్పష్టంగా తెలుస్తాయని ఆయన చెప్పారు. అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా రేషన్‌ను పేదలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మార్పుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. తిరుపతిలో 66,243 మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. వీరికి నగరంలోని 102 చౌక దుఖాణాల ద్వారా రేషన్ ప్రతి నెలా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వృద్ధులకు, దివ్యాంగులకు ప్రతి నెల 26వ తేది నుంచి 31 వ తేది వరకు ఇంటి వద్దకే రేషన్ అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్ ఓ రాజు, తహసిల్దారు సురేష్ కుమార్, ఏపి అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ డైరకట్టర్ వూకా విజయ్ కుమార్, ఎస్సీ కార్పోరేషన్ డైరక్టర్ కుమారమ్మ, డిప్యూటి మేయర్ ఆర్సీ మునికృష్ణా, జనసేన కార్పోరేటర్స్ సికే రేవతి, కల్పనా యాదవ్, వరికుంట్ల నారాయణ, పుష్పావతి, దంపూరు భాస్కర్, రాజా రెడ్డి, మహేష్ యాదవ్, వెంకటేశ్వర్లు, తిరుత్తుణి వేణుగోపాల్, దూది శివ, బాలిశెట్టి కిషోర్, అన్నారెడ్డి యువరాజ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రమేష్ నాయుడు, మునస్వామి, కెవి రమణ, సూర్యకుమారి, రాధా తదితరలు పాల్గొన్నారు.

## సాంకేతికతతో స్మార్ట్ రేషన్ కార్డులు



రామచంద్రాపురం, ఆగస్టు 25 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి తెలిపారు. సోమవారం కెకెవి పురంలో రెవెన్యూ అధికారులతో ఆయన స్మార్ట్ రేషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటిఎం కార్డు సైజులో క్యూఆర్ కోడ్ ఆధారిత రేషన్ కార్డులలో కుటుంబ సభ్యుల పూర్తి సమాచారం నిక్షిప్తం చేయడిందన్నారు. మండలంలో మొత్తం 9611 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. లబ్దిదారుల ఇంటి వద్దకే స్మార్ట్ రేషన్ కార్డులు చేరవేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి, టిడిపి నాయకులు ఉమాపతి నాయుడు, మునిమోహన్, జయశంకర్, రాఘవేంద్ర నాయుడు, లోకేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలను పాటించండి : ఎస్ఐ



రామచంద్రాపురం, ఆగస్టు 25 ప్రభాతవార్త:వినాయక చవితి ఉత్సవాలలో ఎటువంటి సమస్యలు తలెత్తనీయక ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ మురళీమోహన్ అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద పలు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, విద్యుత్‌శాఖ ఏఈ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల బాధ్యత కమిటీదే : డీఎస్పీ



రేణిగుంట, ఆగస్టు 25 ప్రభాతవార్త : మండపాల్లో వినాయక ప్రతిమలను ప్రతిష్టించి గణేష్ ఉత్సవాలు జరిపే కమిటీ సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంటుందని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. రేణిగుంట పట్టణంలోని ఓ హోటల్ నందు వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులతో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వాటి పూర్తి బాధ్యత కమిటీపై ఉంటుందన్నారు. రాత్రి ప్రభుత్వ నిర్ణీత సమయం తరువాత సౌండ్ పొల్యూషన్ ఉండకూడదన్నారు. మండప నిర్వాహకులు వాలంటీర్లను నియమించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో భక్తి ప్రపత్తులతో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు..

## మండలంలో 21031 కార్డుల పంపిణీకి సిద్ధం!



రేణిగుంట, ఆగస్టు 25 ప్రభాతవార్త : రేణిగుంట పట్టణంలో సోమవారం రెవిన్యూ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. మండలంలో దాదాపు 21031 స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ చేస్తున్నట్లు రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఐదు రోజులపాటు కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ప్రభుత్వం యంత్రాంగం ఇంటింటికి వచ్చి రేషన్ కార్డులు పంపిణీ చేస్తారని తెలిపారు. మండలంలో అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్డుల్లో పొరపాటున ఏవైనా తప్పులు అచ్చు అయితే వాటిని సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. పంపిణీ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రమణ్యం రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, రేణిగుంట టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పుష్పనాదం, కరకంబాడి క్లస్టర్ ఇన్చార్జి బుజ్జి నాయుడు రేషన్ షాపుల డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు



వెదురుకుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త : వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా సోమవారం బోజనీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఔషద మొక్కల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాలల్ డాక్టర్ అన్నపూర్ణ శారద మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రాదాయాలు పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. వినాయక చవితి ఉత్సవాలకు పెద్ద పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసి బాణాసంచ పేల్చి, పరిర్యావరణ, శబ్ద కాలుష్యంకు కారణమవుతున్నారని గుర్తించాని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బిఎల్‌పి.లత, బోటనీ అధ్యాపకులు ఎల్ఎం. భక్షు, సి.అరుణ, ఐక్యూ ఏసీ సమన్వయకర్త పి.వెంకటేశు, అధ్యాపకులు, విద్యార్థులు లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
E.P.No. 3 of 2025
O.S.No. 15 of 2024
Between:
A.Subramanyam Naidu ...Decree Holder
And:
M.C.Praveen,
S/o M.Chandrasekar Chetty, business,residing at Door No.1-34, Bazaar Street,Penumur Village and Mandal,Chittoor District ...Judgement Debtor
Sale Notice to Judgement Debtor
Take Sale Notice that you the Judgement Debtor in the above E.P.No.3 of 2025 in O.S.No.15 of 2024 to appearance on 1-9-2025 at 10.30 A.M, before the Honourable court either in person or by an Advocate and file your objections if any otherwise the matter will be decided in your absence on the material available on record.
Sd/- S.SANKARA NAIDU, M.Com., LLB., Advocate, Naidu Buildings, Chittoor

## స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



గూడూరు, ఆగ్టు 25 ప్రభాతవార్త: గత వైసిపి ప్రభుత్వంలో రేషన్ కార్డులు, ప్రజల ఆస్తుల పాస్ పుస్తకాల్లో కూడా ముఖ్యమంత్రి ఫోటోలు వేసుకున్నారని నేడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు న్యాయబద్ధంగా రాజ ముద్రతో స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పాలన రాజ్యాంగబద్ధంగా సాగుతుందని గతంలో రేషన్ కార్డుప్రజలకు సంబంధించిన ఆస్తులు పాస్ పుస్తకాలపై ముఖ్యమంత్రి ఫోటోలు వేసుకున్నారని గుర్తు చేశారు. నేడు ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తుందని వాటి మీద ఎక్కడ ఫోటోలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తాసిల్దార్లు ప్రసాద్, కే శ్రీనివాసులు నాయకులు కిరణ్ కుమార్, వెంకటేశ్వరరాజు, రహీం, వైయస్సార్ బిల్లు చెంచు రామయ్య, కరుణాకర్ రెడ్డి, మట్టం శ్రావణి రెడ్డి భారతి, రాజశేఖర్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా!



వాకాడు, ఆగస్టు 25 ప్రభాతవార్త: ఏఎంసి పరిధిలోని రైతుల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామని వాకాడు వ్యవసాయ మార్కెటింగ్ నూతన చైర్మన్, వైస్ చైర్మన్లు ప్రమీల, దువ్వూరు మధుసూదన్ రెడ్డిలు అన్నారు. సోమవారం వాకాడు ఏఎంసి కార్యాలయం ఆవరణంలోని ఏఎంసి శాఖ ఏడి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో నూతన ఏఎంసి చైర్మన్ దార ప్రమీల, ఏఎంసి వైస్ చైర్మన్‌గా దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల డైరెక్టర్ల చేత ప్రమాణస్వీకారం చేయించారు. గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ కష్టపడిన వారికే పదవులు వచ్చాయని, మార్కెట్ కమిటీకి అన్ని విధాలుగా అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, పాపారెడ్డి మనోజ్ కుమార్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి,పలగాటి భాస్కర్ రెడ్డి, కిషోర్ నాయుడు దశరథ రామిరెడ్డి, దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, జలీల్ అహ్మద్, మధు యాదవ్, దార సురేష్, శంషుద్దీన్, శీలం కిరణ్ కుమార్, కృష్ణ మూర్తి, శ్రావణి రెడ్డి, తీగల చంద్రశేఖర్, శ్రీపతి బాబు,కోట, వాకాడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## మండలంలో టిడిపిని నిర్వీర్యం చేసే కుట్ర



పెళ్లకూరు,ఆగస్టు 25 ప్రభాతవార్త: మండలంలో టిడిపి పార్టీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని దీనిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఇలాంటి కుట్రలో భాగస్వాములైన అధికారులపై చర్యలు తీసుకునేలా చూస్తామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు అన్నారు. మండలంలో ఎంపీడీవో గా పనిచేస్తున్న అధికారిణి వైయస్సార్సీపీ తొత్తుగా వ్యవహరిస్తుందని ఎమ్మెల్యేకి అనుకూలంగా ఉన్నట్టు నటిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు మధ్య చిచ్చులు పెడుతుందని ఆరోపించారు. ఎంపీడీవో ఈ వింత పోకడాలతో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు మధ్య చిచ్చు పెడుతూ పార్టీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేలూరు మురళీకృష్ణారెడ్డి చైతన్య కృష్ణారెడ్డి నాగేంద్ర రెడ్డి కందమూడి శివకుమార్ రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

## బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త: పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ప్రసూతి కేంద్రంలో ఉన్న బాలింతలకు లైన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపి, టౌన్, వెస్ట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో క్లబ్బు ప్రెసిడెంట్ లయన్ బండ్ల సుధాకర్, వాణిల మనవరాలు డి వేద వాంగ్మయి పుట్టినరోజు సందర్భంగా బాలింతలకు, పురిటి బిడ్డలకు బట్టలు, పౌష్టికాహారం అంద జేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ లైన్స్ క్లబ్బుల ద్వారా ప్రతినిత్యం అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ డిస్టిక్ గవర్నర్ ఎంజెఎఫ్ లయన్ ఆర్‌వి రావు, టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ ఎం. శ్రీనివాస్ యాదవ్, పాస్ట్ జోన్ చైర్మన్ లయన్ వై గురునాథం, ఎస్.ఎల్.ఎన్ స్వామి, హరికృష్ణ, సుధీర్, రత్నయ్య, నరసయ్యలు పాల్గొన్నారు.

## దౌర్జన్యంగా ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



గూడూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త: అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గూడూరు డివిజన్ కేంద్రంలో చెన్నూరు గ్రామానికి చెందిన గుర్రాల సుమిత్రమ్మ ఇంటి స్థలములో వున్న హద్దు రాళ్ళను తొలగించి ఆమెపై దౌర్జన్యం చేసి ఇళ్ళు నిర్మాణాన్ని అడ్డుకుంటున్న గుర్రాల చంద్ర శేఖర్ పై అధికా రులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెకు రక్షణ కల్పించి ఆమె స్థలానికి యాజమాన్య కల్పించి ఆమెకు ఇళ్ళు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ గూడూరు రెవెన్యు డివిజనల్ కార్యాలయము వద్ద ఆందోళన ధర్నా చేసి రెవెన్యు డివిజనల్ అధికారి వారికి వినతి పత్రం సమర్పించారు. మరో వైపు ఆక్రమణ దారుడు వై.యస్.ఆర్ పార్టీ అండ దండలు ఉన్నాయని నీకు దిక్కు వున్న చోట చెప్పుకో అని వృద్ధురాలైన సుమిత్రమ్మని బెదిరిస్తున్న కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమములో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు డి.నవకోటి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు బి.మమత, పాస్టర్ పి. సుధాకర్ రావు, బాధితరాలు గుర్రాల సుమిత్రమ్మ, గుర్రాల హరిబాబు, గుర్రాల ఆశీర్వాదం, డి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## జనానికి నచ్చిన,మెచ్చిన నాయకుడు పవార్



శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త: రాజకీయాల్లో, ఆధ్యాత్మిక రంగంలో జనానికి నచ్చిన, మెచ్చిన నాయకుడు శాంతారం జె పవార్ అని పలువురు వక్తలు అభివర్ణిం చారు. రెండు సార్లు శ్రీకాళహస్తి మున్సిపల్ చైర్మెన్‌గా ఆయన మున్సిపాలిటిని అభివృద్ధి పథంలో నడిపారన్నారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా దేవస్థానం అభివృద్ధికి పథకాలు రూపొందించి అమలు చేసారన్నారు. రాహుకేతుదోష నివారణ పూజలును ప్రవేశ పెట్టిన ఘనత ఆయనదే అన్నారు. ఈ కార్యక్రమాల్లో పివిఆర్ గ్రూప్‌కు చెందిన డైరెక్టర్లు జనార్ధన్‌రావు పవార్, ముకుందరావు, సదరాం, సత్యనారాయణ, హెచ్ బాబు, దొర నాయుడు, టైలర్‌రాము, నారాయణ,వేంకటేశ్వరరావు, ద స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే జోరుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



సత్యవేడు, ఆగస్టు 25 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే ఆదిమూలం ఏడు మండలాల్లో కార్డులు పంపిణీని ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదిమూలం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్యూ ఆర్ కోడ్ కార్డులతో రేషన్ సరకులు పంపిణీలో పారదర్శకత ఉంటుందని ఎమ్మెల్యే తెలియజేశారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మెల్యే నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో సుడిగాలి పర్యటన చేసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఉదయం నుంచి నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీ పురంలలో మండలకేంద్రాలకు చేరుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులతో కలసి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసి ప్రజల నుంచి శభాష్ అనిపించుకున్నారు. కార్యక్రమంలో సత్యవేడు తహసీల్దార్ రాజశేఖర్, డీటీ త్యాగరాజు, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ మోహన్ బాబు, కావేరి, రమణ, రాజా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే అసోసియేషన్ ధ్యేయం

### - ఏపీఎంఎఫ్ రాష్ట్ర, జిల్లా కో-ఆర్డినేటర్ కల్లు సురేంధర్‌రెడ్డి

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 25 ప్రభాతవార్త : జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) ధ్యేయమని సంఘం రాష్ట్ర, తిరుపతి జిల్లా కో-ఆర్డినేటర్ కల్లు సురేంధర్‌రెడ్డి అన్నారు. సంఘ వ్యవస్థాపకులు ఢిల్లీబాబురెడ్డి ఆదేశాల మేరకు స్థానిక శ్రీదేవి కాంప్లెక్‌లో సోమవారం ఆ సంఘం జిల్లా కమిటి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్లు సురేంధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల అక్రిడేషన్ల మంజూరు విషయంలో ఏపీఎంఎఫ్ చేసిన కృషిని తెలియజేశారు. అంతే కాకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించడంలో సంఘం ముందు వరుసలో ఉందన్నారు. ఒక పక్క జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో మంతనాలు జరుపుతూ పరిష్కరించడం జరుగుతుందని, మరో పక్క సంఘ బలోపేతానికి పెద్దలు ఢిల్లీబాబురెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ నెల 31న మామండూరలో జరగనున్న జిల్లా కమిటి కార్యవర్గ సమావేశంలో మరిన్ని తీర్మానాలను తీసుకోనున్నట్లు కల్లు సురేంధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి అధ్యక్షులు శివమూర్తి, కార్యదర్శి తిరుపాల్, జిల్లా ఉపాధ్యక్షులు సి. పరంధామరెడ్డి, జయశంకర్, మనోహర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ మునిచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎన్. చంద్రకళారెడ్డి, హిమజాశ్రీ, కల్యాణ్, మోహన్, బాలసుబ్రమణ్యం, సాయికుమార్, మధు, జర్నలిస్టు సోదరులు పాల్గొన్నారు.

## నయనంపల్లి సంఘమిత్ర రూ.8 లక్షల స్వాహా

పూతలపట్టు, ఆగస్టు 25 ప్రభాతవార్త : మండల పరిధిలో ఉన్న వావిల్ తోట పంచాయతీకి గాను ఐదు మంది సంఘమిత్రలు ఉన్నారు. నయనం పల్లి సంబంధించిన సంఘమిత్ర శ్యామల సుమారు రూ 8,50,000 లక్షల అవినీతికి అక్రమాలకు పాల్పడింది. నయనం పల్లి హరిజనవాడ ఎగవ కండ్రిగ దిగువ కండ్రిగ వీర్ల గుడిపల్లి మాదిగ పల్లి గ్రామాలకు సంఘమిత్రగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామాలకు 26 గ్రూపులు ఉన్నాయి. సాయిబాబా గ్రూప్‌లో నెలకొకసారి గ్రూప్‌లో సమావేశం అయ్యి పదిమంది నెలకు కలిసి రూ. 83,000 వేలు లోను నగదును బ్యాంకులో కట్టుతారు కానీ సంఘమిత్ర నమ్మకంతో నగదును కట్టమని ఇస్తారు. సంఘమిత్ర లోను నగదును ఒకే నెల కట్టింది. రెండు సంవత్సరాలుగా లోను రుణాలకు సంబంధించిన నెలవారీ నగదును బ్యాంకులో డిపాజిట్ చేయకుండా చేశారని మహిళా సంఘాలు సభ్యులు అధికారులకు చెప్పగా నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. గతంలో కూడా ఈశ్వరి గ్రూపులో కూడా రూ. 2లక్షల 30 వేలు అదే విధంగా గణేష్ గ్రూపులో రూ. 3 లక్షల 50 వేలు అవినీతికి అక్రమాలకు పాల్పడింది.

**కరువైన పర్యవేక్షణ...**

సాధారణంగా మండల అధికారులు సంఘాల సభ్యులతో వెలుగు కార్యాలయంలో సమావేశాలు జరుగుతూ ఉంటాయి. ఇంత అవినీతి జరుగుతున్న నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం పై సర్వత్ర అనుమానాలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయంలో క్షేత్రస్థాయి వెలుగు సిబ్బందితో పాటు సీసీలు మండల వెలుగు అధికారులు హస్తం కూడా ఉందని వారు ఆరోపించారు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి సాయి బాబా గ్రూపుకు న్యాయం చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరారు.

## చివరి గమ్యం పరమసముద్రం చెరువుకు చేరిన కృష్ణమ్మ

కుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త : హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో చివరి గమ్యస్థానం అయిన మున్సిపల్ పరిధి పరమసము ద్రం చెరువుకు సోమవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో కృష్ణాజలాలు చేరుకున్నాయి. పెద్దపంజాణి మండలం అప్పినపల్లి వద్ద మొదలయ్యే కుప్పం బ్రాంచ్ కెనాల్ 143కి.మీ.ల దూరం ప్రవహించి కుప్పం పరిధి పరమసము ద్రం చెరువుకు చేరాయి. సోమవారం ఉదయం శాంతిపురం మండలం సోమాపురం - గుడుపల్లె మండలం పెద్దవంక వద్ద గల పెద్ద టన్నెల్ గుండా నీరు గలగల పారుతూ గుడుపల్లె మండలంలోని వెంకటాపురం, సోడిగానిపాళ్యం, అనంతరం కుప్పం మండలం జరుగు, గుడ్లనాయనపల్లి, కెడిపల్లి, గట్టప్పనాయనపల్లి కాలువ మీదుగా

## శ్రీనివాస్‌సత్రం రోడ్డుకు మరమ్మతులు

కోట,ఆగస్టు 25 ప్రభాతవార్త: ఈనెల 27న వినాయక చవితి పండగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో భక్తులు విగ్రహాలకు పూజలు చేస్తారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు వినాయకుని నిమజ్జం చేసే క్రమంలో కోత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాస్‌సత్రం వద్ద ఉన్న సముద్రంలో నిమజ్జనం చేస్తారు. ఆక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరు వైపుల పేరిగిపోయి ఉన్న చెట్లును ,కోమ్మలను తహిశీల్దార్ కె.జయజయరావు ఆదేశాలతో తోలిగించారు. ఆపనులను తహిసీల్దార్ జయజయరావు పర్యేక్షించారు. రాకపోకలకు రహదారిని క్లిర్ చేశారు.

## స్మార్డ్ రేషన్ కార్డుల పంపిణీ



కోట,ఆగస్టు25 ప్రభాతవార్త : స్థానిక ఎంఆర్‌సి భవనంలో సోమవారం స్మార్డ్ రేషన్ కార్డుల పంపిణీని తహిసీల్దార్ కె.జయజయ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జయజయ రావు మాట్లాడుతూ మండలంలో 15,991 కార్డులకు గాను 33 రేషన్ ఉన్నట్లు తహిసీల్దార్ చెప్పారు. ఆయాచౌకదుకాణాల వద్ద ఈ స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈనెల 15 తేదీ వరకు ఈ స్మార్డ్ కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వి.వేణు. డిప్యూట్ తహిసీల్దార్ మల్లిఖార్జున్ రావు తెదేపా జిల్లా మైనార్టి సెల్ అధ్యక్షులు, జలీల్ ఆహ్మద్, వెంకనపాళెం సర్పంచ్ మదుయాదవ్, షంసద్దీన్,దారా సురేష్, మండల తెదేపా ప్రధాన కార్యదర్శి, టి. కోటీశ్వరరావు, డిప్యూట్ తహిసీల్దార్ మల్లిఖార్జున్ రావు ఉన్నారు.పంచాయతీ కార్యదర్శిలు ఉన్నారు.

## హాస్టల్స్‌లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు

బాలాయపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త : ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహాలలో ఫిర్యాదు బాక్సుల ఏర్పాటు చేసిన వెంగమాంబపురం హాస్టల్ వార్డెన్ పదముర్తుమ్ శ్రీనివాసులు, బాలాయపల్లి వార్డెన్ పసుపులేటి శ్రీనివాసులు తెలిపారు. ర్యాగింగ్, భోజనాలు, వసతులపై ఫిర్యాదులను నిర్భయంగా చిన్నారులు ఫిర్యాదు బాక్సులో లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చునని వారు చెప్పారు. తిరుపతి అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జోష్నా ఫిర్యాదు బాక్సులను ప్రతినెలా తనిఖి చేసి ఫిర్యాదులు పరిశీలించి పరిష్కరిస్తారు అని తెలిపారు.

## సచివాలయ సిబ్బందిపై చర్యలు : ఎంపీడీవో



బాలాయపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త: విధులు సక్రమంగా నిర్వహించని సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. వెంగమాంబపురం గ్రామ సచివాల యంను ఎంపిడిఓ డీజే వినీల్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయాల కు గైర్హాజ రైనా, ఆలస్యంగా హాజరైనా చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు. సచివాలయంలో ఆరుగురు సిబ్బంది ఉండగా పనిచేస్తుండగా నలుగురు మాత్రమే విధులకు హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరయ్యారని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆలస్యంగా వచ్చారని, వెల్ఫేర్ అసిస్టెంట్ గైర్హాజరయ్యారని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



బాలాయపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త : వెంగమాంబ పురం గ్రామ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్, సొసైటీ అధ్యక్షులు, మాజీ ఏఎంసి చైర్మన్ సీసీ నాయుడు, సర్పంచి వెంకటసుబ్బయ్య, డీలర్ ఉప్పలపాటి మోహనకృష్ణ పంపిణీ చేశారు. డిజిటల్ పాకెట్ ఫ్రెండ్లీ రైస్ కార్డులను సులభతరంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా తీసుకెళ్లినందుకు వీలవుతుందని ఆయన వివరించారు. ప్రభుత్వం స్మార్ట్ కార్డులతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. సీఎం చంద్రబాబు పాలన దేశానికే ఆదర్శంగా ఉందనిడీలర్ ఉప్పలపాటి మోహనకృష్ణ తెలిపారు.

## రైతుల అభ్యున్నతికి కృషి చేస్తా ఏఎంసీ చైర్మన్



వెంకటగిరి, ఆగస్టు 25 ప్రభాతవార్త: రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం (మురుగ) తెలిపారు. వెంకటగిరి ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఏఎంసి ద్వారా రైతుల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ప్రభు త్వం నుండి వచ్చే పథకాలను రైతులకు అందజేస్తారని వివరించారు. ఏఎంసి మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పారు. వైస్ చైర్మన్‌గా కూని సూరి, డైరెక్టర్లుగా తాళ్లూరు ప్రసాద్, రాపూర్ శ్రీనివాసులు, వెలుగులేటి వెంకటేశ్వర్లు, సగం మల్లీశ్వరి, వెంకటా చలపతి, ఆరికట్ల శ్రీరాములు నాయుడు, దందలు పెంచల్‌రెడ్డి, రంగనేని కోటేశ్వరరావు, నీలకంఠం మురళి, చీటేపు వెంకటాచలపతి, నల్లజం సుబ్రహ్మణ్యం సుబ్బరాయుడు కోన రవిశంకర్, డైరెక్టర్గా బాధ్యతలు చేపట్టారు.

## కొరత సృష్టించే వ్యాపారులపై చర్యలు : సిఐ



వెంకటగిరి, ఆగస్టు 25 ప్రభాతవార్త: యూరియా కృత్రిమ కొలత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వ్యాపాలుపై చర్యలు తీసుకుంటారని సిఐ ఏవి రమణ హెచ్చరించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పట్టణంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను బ్లాక్‌లో అమ్మితే చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఏడిఏ అనసూయ, ఏవో సుజాత షాపులను తనిఖీ చేశారు.

## ఆద్యంతం.. ఉత్సాహభరితం..

### - రెండోరోజూ హోరాహోరీగా క్రీడాపోటీలు - పర్యవేక్షించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు



తిరుపతి క్రీడ, ఆగస్టు 25 ప్రభాతవార్త: ఆర్చరీ, బాక్సింగ్, కబడ్డీ, వాలీబాల్ మ్యాచులను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి, యాదవ్ కార్పోరేషన్ ఛైర్మన్ నర్సింహ యాదవ్, శ్రీధర్ వర్మ తదితరులు ప్రారంభించారు. అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు రెండవ రోజు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. ఎస్వీయూలోని తారకరామా స్టేడియం, ఎస్వీ స్కూల్ క్యాంపస్, ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన వివిధ క్రీడాపోటీలను శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సోమవారం పర్యవేక్షించారు. తొలుత తిరుపతి ఎస్వీ స్కూల్ క్యాంపస్‌లో జరిగిన ఆర్చరీ పోటీల్లో 4జోన్లు నుంచి 89మంది మెన్ అండ్ ఉమెన్ ఆర్చర్‌లు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కాంపౌండ్, రికర్వ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో జరిగిన పోటీలను శాప్ డైరెక్టర్లతో కలిసి శాప్ ఛైర్మన్ పర్యవేక్షించారు. అలాగే ఎస్వీయూ తారకరామా స్టేడియంలో రెండవ రోజు జరిగిన అథ్లెటిక్స్ పోటీలను వీక్షించారు. ఈ పోటీల్లో 4 జోన్ల నుంచి 80మంది మెన్ అండ్ ఉమెన్ అథ్లెట్ లు పాల్గొన్నారు. 100 మీటర్స్, 400 మీటర్స్, 800 మీటర్స్, లాంగ్ జంప్, షాట్‌పుట్ ఈవెంట్‌లో అథ్లెట్ లు తమదైన శైలిలో ప్రతిభ కనబరిచారు.

- రసవత్తరంగా బాక్సింగ్ పోటీలు..

ఎస్వీయూలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఇండోర్ హాలులో బాక్సింగ్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. శాప్ ఛైర్మన్ నాయుడు అధ్యక్షతన ప్రారంభించిన బాక్సింగ్ పోటీలను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, యాదవ్ కార్పోరేషన్ ఛైర్మన్ నర్సింహ యాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ముఖ్య అతిధులుగా పాల్గొని బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. మెన్ బాక్సింగ్‌లో 42 మంది, ఉమెన్ బాక్సింగ్ లో 39 మంది పాల్గొని పంచ్‌లతో విరుచుకుపడ్డారు. అనంతరం వెయిట్ కేటగిరీలో గెలుపొందిన బాక్సర్‌లకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

- ఆకట్టుకున్న కబడ్డీ, వాలీబాల్, ఆర్చరీ పోటీలు.. ఎస్వీ క్యాంపస్ స్కూల్ గ్రౌండులో వాలీబాల్ పోటీలు, ఆర్చరీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అలాగే శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో కబడ్డీ పోటీలు ఆద్యంతం అద్భుతంగా జరిగాయి. శాప్ ఛైర్మన్ రవినాయుడు, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, యాదవ్ కార్పోరేషన్ ఛైర్మన్ నర్సింహ యాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ పాల్గొని జోన్3, జోన్2 టీముల మధ్య వాలీబాల్ మ్యాచ్, జోన్1 మరియు జోన్2 పురుషుల టీమ్ ల మధ్య కబడ్డీ మ్యాచును ప్రారంభించారు. ఈ పోటీలకు ముందు ఆర్చరీ పోటీలను పర్యవేక్షించడంతోపాటు యారో విడిచిపెట్టి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు రవీంద్రనాథ్, సంతోష్ కుమార్, రజినీ పాల్గొన్నారు.

## చెంచుకుమార్‌కు న్యాయం చేయాలని ధర్నా

వెంకటగిరి. ఆగస్టు 25 ప్రభాతవార్త: గత సంవత్సరం పోలేరమ్మ జాతరలో పోలీసులు కొట్టడంతో గాయపడిన చెంచు కుమార్‌కి వెంటనే ప్రభుత్వం నుండి తగు సహాయం అందజేయాలని దళిత సంఘం నాయకుడు రామకృష్ణ తెలిపారు. గత సంవత్సరం పోలేరమ్మ జాతరలో పోలీసులు కొట్టి గాయపరిచిన చెంచు కుమార్ కు వెంటనే సహాయం అందజేయాలని వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయం వద్ద దళిత నాయకులు ధర్నా చేశారు. వెంటనే ఇతన్ని ఆదుకోవాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ నాయకులు రవి, మాజీ ఉపసర్పంచ్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## డీఈగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు



వెంకటగిరి, ఆగస్టు 25 ప్రభాతవార్త: విద్యుత్ శాఖ డీఈగా పి. శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. డిఈ శ్రీనివాసులను కౌన్సిలర్ ఆరి.శంకరయ్య మర్యాదపూర్వ కలిసి అభినందనలు తెలిపారు. డిఈ ని ఆయన సత్కరించారు. పలు అంశాలపై కౌన్సిలర్ డిఈ చర్చించారు.

## టిడిపి అధికారంలో మహిళలకే పెద్దపీట : ఎమ్మెల్యే



వాకాడు, ఆగస్టు 25 ప్రభాతవార్త: టిడిపి పాలనలో మహిళలకి ఉచిత పథకాలుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారని గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం శ్రీ శక్తి ఆధ్వర్యంలో ఏపిఎం పోలమ్మ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో వాకాడు బ్యారేజ్ నుండి పొదుపు మహిళలతో అశోక పిల్ల సెంటర్ వరకు భారీగా ర్యాలీ చేపట్టి అశోక స్థూపం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మధు రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ మనోజ్ కుమార్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, చిరంజీవి అమ్మ, వివిధ శాఖల అధికారులు, కోట,వాకాడు,చిట్టమూరు, గూడూరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు నిబంధనలు తప్పనిసరి : ఎస్ఐ

కోట,ఆగస్టు 25 ప్రభాతవార్త : చవితి ఉత్సవాలకు మండలంలో ఏర్పాటు చేసే వారు ఖచ్చితంగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉందని ఎస్ఐ పవన్ కుమార్ చెప్పారు. సోమవారం ఆయన కోట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వార కూడా అనుమతి తీసుకొచ్చన్నారు. ప్రశాంత వాతవరణంలో పండగను జరుపు కోవాలన్నారు. ఎవరైనా నిబంధనాలను అతిక్రమిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొవడం జరుగుతుందని హెచ్చరించ్చారు.

## గూడలిలో చోరీపై విచారణ

కోట,ఆగస్టు 25 ప్రభాతవార్త : మండలం గూడలి గ్రామంలో శ్రీసంగమేశ్వరస్వామి ఆలయంలో హుండి పగల కోట్టి చోరీ జరిగిన సంఘటనపై సోమవారం దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ సుధీర్ ఆలయంలో విచారణ జరిపారు. ఈ విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ పూజారి కార్తీక్ శర్మ, అప్పటి ఇఒ. శంశాక్ హజరైయారు. చోరీ జరిగిన సంఘటను వారు పూర్తి స్థాయిలో ఇన్స్‌పెక్టర్‌కు వివరించారు. వాచ్‌మేన్ సుబ్బయ్యను కూడా విచారణ చేశారు.

## స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మార్వో

పెళ్లకూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వంఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం నాడు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పెళ్లకూరు మండల తహశీల్దార్ హరికృష్ణ మండలంలోని పలు గ్రామాలలో అర్హులకు అందజేశారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డులో కుటుంబ పెద్ద ఫోటోతో పాటు క్యూఆర్ కోడ్ కూడా ఉండడం గమనార్హం. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం ఎలాంటి అవినీతి అవకతావకలు లేకుండా చేయడమే అన్నారు.

## మురికి నీరు నుండి విముక్తి కలిగించండి



గూడూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త : పడమర గూడూ రులోని జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌కు చెందిన నిర్వాసితులు సోమవారం గూడూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో ప్రాంగణంలో తమ సమస్యను మొరపెట్టుకున్నారు. కాలనీలో మురికి నీరు బయటకు పోనివ్వకుండా ఎస్వీఆర్స్ అండ్ సైన్స్ కాలేజీ యాజమాన్యం, గోడను అడ్డంగా నిర్మించి నందు వలన సదరు మురికి నీరు నివాసాలు ఉంటున్న ఇళ్ల మధ్యనే నిలబడిపోయి, దోమలతో దుర్వాసన వచ్చి నిత్యం అనారోగ్యాలతో ఆసుపత్రులు పాలవుతురన్నారు. 52 కుటుంబాలకు చెందిన వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని పోయి మొరపెట్టుకోవడంతో వెంటనే స్పందించిన వారు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు పై విషయమై న్యాయం చేయవలసిందిగా తెలియ జేయడమైనది. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి కుమార్, సి.ఐ.టి.యు గూడూరు పట్టణం ప్రధాన కార్యదర్శి బి.వి రమణయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఏంబేటి చంద్రయ్య, ఆటో సంఘం నాయకులు వి.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్లేకార్డులతో నిరసన

గూడూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట శుక్రవారం ఏపీ.పి.టి.డి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు జోనల్ చీఫ్ అడ్వైజర్ ఎస్.కె.ఎం అహ్మద్ మాట్లాడుతూ చిన్న పొరపాటుకి శ్రావణ్ కుమార్ అనే కండక్టర్‌ను సస్పెండ్ చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జిఎస్ వాసులు, రీజనల్ ఉపాధ్యక్షులు కే. వెంకటేశ్వర్లు, రీజినల్ అసిస్టెంట్ సెక్రటరీ డి.శ్రీకళ, నాయకులు మస్తాన్ మల్లికార్జున రాము ఉమామహేశ్వరి, గీత, పార్వతి, టీవీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 15వేల వినాయక విగ్రహాల పంపిణి



శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త: రెండు జిల్లాల్లోని గ్రామాల్లో వినాయ విగ్రహాలను అందిస్తున్న ఘనత సురేంద్రకుమార్‌రెడ్డికి దక్కిందని వక్తలు అన్నారు. ఇక్కడి శ్రీరామ్‌నగర్‌కాలనీలోని రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు సురేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధులుగా మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోలా ఆనంద కుమార్, బొజ్జల బృందమ్మ, రంగినేని చెంచయ్య నాయుడులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఒకటి రెండు కాదు 15వేల విగ్రహాలను అందించాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదన్నారు. సురేంద్ర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత తొలిపండగ కాబట్టి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో కూడా గ్రామాల్లో వినాయక విగ్రహాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి నాయకులు చంద్రప్ప,కండ్రిగ ఉమ,పోతల రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ అర్చకుడు హరీష్‌స్వామి మృతి



కాణిపాకం, ఆగస్టు 25 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో పనిచేస్తున్న హరీష్‌స్వామి అనారోగ్య కారణాలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం అనుబంధ ఆలయాలు శ్రీవరదరాజ స్వామి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న హరీష్‌స్వామి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో బెంగుళూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కన్నుమూశారు. స్వగ్రామం ఐరాలలో హరీష్‌స్వామి మృతదేహనికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.